క్లుప్తంగా

తాగునీటి సౌకర్యం



ఆత్మకూరురూరల్: వాశిలి పంచాయతీలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు తాగునీటి సౌకర్యం కల్పన పనులను సర్పంచ్ చెలిక రమాహరిబాబు ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. పంచాయతీ కార్యాలయం, ఎస్సీ, ఎస్టీకాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యంతో పాటు మరుగుదొడ్లకు సంబంధించిన పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు.

ఉపాధి పనుల తనిఖీ



సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లి, సీతారామపురం పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్ల నమోదు, నీటి కుంటల కొలతలను నిశితంగా పరిశీలించారు. ఆమె వెంట ఈసీ సువార్తయ్య ఉన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ గ్రామసభలు

ఉదయగిరి: మండలంలో 17వ విడత ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభలు మంగళవారం నుంచి 17వ తేదీ వరకు జరుగుతాయని ఏపీఓ బీ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. 11న పుల్లాయపల్లి, జీ అయ్యవారిపల్లి, జీ చెరువుపల్లి, 12న ఆర్లపడియ, శకునాలపల్లి, నేలటూరు, 13న కృష్ణంపల్లి, గన్నేపల్లి, 14న జీ చెర్లోపల్లి, 16న ఉదయగిరి, కొండాయపాళెం, బండగానిపల్లి, 17న దాసరపల్లి, తిరుమలాపురం, వెంగళరావునగర్, అప్పసముద్రం, గండిపాళెం పంచాయతీల్లో గ్రామసభలు జరుగుతాయని వివరించారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

ఉదయగిరి/వరికుంటపాడు: ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ పథకం కింద గర్భిణులకు వైద్యపరీక్షలను సోమవారం నిర్వహించారు. గండిపాళెం పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులకు వైద్యులు తాగూర్, శివకల్పన వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు ఆహారాన్ని అందజేశారు. ఏఎన్‌యంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. అలాగే వరికుంటపాడు పీహెచ్‌సీలో వైద్యాధికారిణి కరిష్మా 13 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. గర్భిణులు రక్తహీనతకు గురవకుండా పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు కీలకం



సంగం: మామిడిలో సస్యరక్షణ చర్యలు కీలకమని, పూత, పిందె దశలో సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే దిగుబడులు తగ్గిపోవడంతో పాటు కాయల నాణ్యత తగ్గే అవకాశం ఉందని ఉద్యాన అధికారిణి పీ లక్ష్మి తెలిపారు. సంగంలోని మామిడి తోటలను సోమవారం ఆమె పరిశీలించారు. నల్లతామర, తేనె మంచు పురుగును గుర్తించి నివారణ చర్యలను రైతులకు సూచించారు. నల్లతామర పురుగుల ఉధృతి అధిక ఉష్ణోగ్రతలతో పెరుగుతుందని తెలిపారు. తొలి దశలో నివారించకపోతే కాయలపై మచ్చలు ఏర్పడి నాణ్యత తగ్గే అవకాశం ఉందన్నారు. నల్లతామర నివారణకు కానుగ సోపు 7.5 గ్రాములు లేదా ఆజాడిరాక్టిన్ 300 పీపీఎం 3 మి.లీ. లేదా థయోమిథాక్సిమ్ 25 శాతాన్ని 0.5 మి.లీ లేదా ఫ్రాఫినిల్ 2 గ్రామలు లేదా స్పెనోసాడ్ 0.3 మి.లీ లేదా అసెటోమాప్రిడ్ 0.3 మి.లీను లీటరు నీటికి కలిపి మార్చి మార్చి పిచికారీ చేయాలని సూచించారు. తేనె మంచు పురుగు నివారణకు బుప్రోజిన్ 2 మి.లీ లేదా పిమెట్రోజైన్ 0.6 మి.లీను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

గ్రీవెన్స్‌కు నాలుగు అర్జీలు

ఉదయగిరి: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు అందాయి. భూమి మంజూరు చేయాలని 1, భూసమస్యలు పరిష్కరించాలని మూడు అర్జీలు అందాయని తహసీల్దార్ సుభద్ర తెలిపారు.

కనీస వేతనాలు కల్పించాలి

వింజమూరు(ఉదయగిరి): ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.300 వచ్చేలా క్షేత్రసహాయకులు చర్యలు తీసుకోవాలని డ్వామా ఏపీడీ శివన్నారాయణ సూచించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సోమవారం ఆయన సమీక్షించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కూలీలు వడదెబ్బకు గురవకుండా పని ప్రదేశాల్లో నీడ సౌకర్యాన్ని కల్పించాలని, తాగునీరు, ఓఆర్ఓస్ ప్యాకెట్లు, మజ్జిగ అందుబాటులో ఉంచాలని సూచించారు. గృహనిర్మాణాలకు సంబంధించిన బిల్లులను త్వరితగతిన ఎంబుక్ చేయాలన్నారు. ఏపీఓ చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన ఈ-నేత్ర సేవలు

- గతేడాది సెపెంబరుతో ముగిసిన అపోలో ఆస్పత్రితో ఒప్పందం
- మూతపడిన సీహెచ్‌సీల్లోని ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- కంటి సమస్యలతో రోగులు
- ఉపాధి కోల్పోయి సిబ్బంది అవస్థ



మూతపడిన ఉదయగిరి సీహెచ్‌సీలోని ఈ-ఐ కేంద్రం

వరికుంటపాడు: పేదల కంటి చూపునకు భరోసా కలిగించే సీఎం ఈ-నేత్ర సేవలు నిలిచిపోయాయి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం అపోలో ఆస్పత్రి యాజమాన్యంతో ఒప్పందం చేసుకుని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలను ప్రారంభించింది. గతేడాది సెప్టెంబరు 4వ తేదీతో ఒప్పంద గడువు ముగియడంతో ఈ కేంద్రాలు మూతపడ్డాయి. ఈ-నేత్ర సేవలను పునరుద్ధరించాల్సిన కూటమి ప్రభుత్వం స్పందించడం లేదు. దీంతో కంటి వైద్యసేవలు అందక కంటి సమస్యలతో బాధపడుతున్న వారు, ఉపాధి కోల్పోయి కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రారంభం

గతంలో రాష్ట్ర ప్రభుత్వం అపోలో ఆస్పత్రి యాజమాన్యంతో ఈ- నేత్ర సేవలను అందించేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి, పొదలకూరు, నాయుడుపేట, వెంకటగిరి, బుచ్చిరెడ్డిపాళెంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ముఖ్యమంత్రి ఈ-నేత్ర కేంద్రాలను ప్రారంభించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ కేంద్రాలకు కొత్త రూపురేఖలు తీసుకొచ్చి పేదలందరికీ మెరుగైన కంటివైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టింది.

అత్యాధునిక వసతులతో మెరుగైన సేవలు

ఈ-ఐ కేంద్రాల్లో ఆప్తమాలజిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎక్విప్‌మెంట్ అసిస్టెంట్‌లను నియమించారు. వారు అత్యాధునిక పరికరాలతో కంటి వైద్యపరీక్షలను నిర్వహించి అపోలో ఆస్పత్రి సిబ్బందికి రిపోర్టులను ఆన్‌లైన్‌లో పంపి సమస్యలను గుర్తించే వారు. కంటి అద్దాలు అవసరమైన వారికి పంపిణీ చేయడం, శాస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా చేసేందుకు సిఫార్సులు చేసేవారు.

1,43,636 మందికి కంటి పరీక్షలు

ఈ-ఐ కేంద్రాలు మూతపడే నాటికి జిల్లా వ్యాప్తంగా 1,43,636 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 50 వేల మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. పది వేల మందికి శస్త్రచికిత్సలు అవసరమని సిఫార్సులు చేశారు.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది జూలై నుంచి ఈ-నేత్ర సేవలు నిలిచిపోయాయి. గతంలో ప్రభుత్వం అపోలో ఆస్పత్రితో కుదుర్చుకున్న ఒప్పందం సైతం గతేడాది సెప్టెంబర్ 4వ తేదీతో ముగిసింది. ఈ-నేత్ర సేవల పునరుద్ధరణను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ-ఐ కేంద్రాలు మూతపడ్డాయి. ఈ విషయం తెలియక కంటి రోగులకు కేంద్రాలకు వెళ్లి మూతపడి ఉండడాన్ని గమనించి నిరాశగా వెనుదిరిగి వెళ్తున్నారు. ప్రధానంగా విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి కంటి, దృష్టి సమస్యలు ఉన్నా పట్టణ ప్రాంతాలకు వెళ్లి అధిక నగదు వెచ్చించి చికిత్సలు చేయించుకురావాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పునరాలోచించి సీఎం ఈ-ఐ కేంద్రాలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

కేంద్రాలను అందుబాటులోకి తేవాలి



ప్రభుత్వం సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీఎం ఈ-ఐ కేంద్రాలు పేదలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉండేవి. వాటిని అధికారులు పూర్తిగా మూసివేయడంతో కంటి సమస్యలు ఉన్నవారు ఎన్నో అగచాట్లు పడుతున్నారు. పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పునరాలోచించి కేంద్రాలను పునరుద్ధరించి ఉపయోగంలోకి తేవాలి.

– కాకు వెంకటయ్య, కృష్ణారెడ్డిపల్లి, ఉదయగిరి మండలం

ఎంతో ఉపయోగకరం



ఉదయగిరి సీహెచ్‌సీలోని ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రం కంటి సమస్యలతో బాధపడుతున్న నాలాంటి వృద్ధులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. కేంద్రాన్ని మూసివేయడంతో దూరప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడడంతో పాటు ఆర్థికంగా నష్టపోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కేంద్రాలను తెరవాలి

– చేజర్ల లక్ష్మిరెడ్డి, చవటపల్లి, ఉదయగిరి మండలం:

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అనుమసముద్రంపేట: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం ఎంపీడీఓ ప్రసన్న కుమారి మాట్లాడుతూ నేడు దేశంలో మహిళలు శక్తివంతులుగా ఎదుగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్యోతిరాణి, అన్ని శాఖలకు చెందిన మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి సహకరించాలి

సీతారామపురం: మండలంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రజలు సహకరించాలని ఈఓపీఆర్డీ భార్గవి కోరారు. సింగారెడ్డిపల్లిలో సోమవారం నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజలకు వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేసి గ్రీన్‌అంబాసిడర్లకు అందజేయాలని సూచించారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేయడం నిషిద్ధమని, అతిక్రమించిన వారికి జరిమానా తప్పదని హెచ్చరించారు. సర్పంచ్ సంపూర్ణమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువతను దగా చేసిన కూటమి ప్రభుత్వం



కావలి: యువత పోరు వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి



ఉదయగిరిలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలతో పాటు విద్యార్థులు, నిరుద్యోగులను కూడా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సకాలంలో ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. రూ.3,900 కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉంటే బడ్జెట్‌లో కేవలం రూ.2,600 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేసి పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత చదువులను అందించారని గుర్తుచేశారు. ఈ పథకాన్ని 2014–19 మధ్య కాలంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని గుర్తుచేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 93 శాతం మంది విద్యార్థులకు మేలు చేసేలా పథకాన్ని విస్తరింపజేశారని వివరించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం పథకాన్ని నీరుగార్చేందుకు కుట్రలు చేస్తోందన్నారు. ఎన్నికల ముందు 20లక్షల ఉద్యోగాలు లేదా ప్రతి నెలా రూ.3వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించిన కూటమి ప్రభుత్వంపై నిరుద్యోగ యువతలోనూ ఆగ్రహం వ్యక్తమవుతోందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులకు అండగా వైఎస్సార్‌సీపీ ఈ నెల 12వ తేదీన ఉదయం 10 గంటలకు నెల్లూరులోని వీఆర్సీ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు యువత పోరు కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం యువత పోరు వాల్‌పోస్టర్లను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

యువత పోరు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఉదయగిరి: ఉదయగిరిలో యువత పోరు వాల్‌పోస్టర్లను వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం చేతిలో మోసపోయిన విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అండగా ఈ నెల 12వ తేదీన నెల్లూరులో చేపట్టే యువత పోరు కార్యక్రమంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ మండలాధ్యక్షులు రేవునూరి శ్రీనివాసరెడ్డి, డీ వాసుదేవరెడ్డి, కాటం రవీంద్రరెడ్డి, నాయకులు మల్లికార్జునరెడ్డి, అక్కులరెడ్డి, గడియాల్చి యస్దాని, ఉప్పటూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సోమశిల: ప్రభుత్వం చేతిలో దగా పడిన విద్యార్థులు, యువతకు అండగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12న నెల్లూరులో చేపడుతు న్న యువత పోరు కార్యక్రమాన్ని చేపడుతు న్నట్లు పార్టీ అనంతసాగరం మండలాధ్యక్షుడు బిజివేముల పిచ్చిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతసాగరం మండలానికి చెందిన విద్యార్థులు, నిరుద్యోగులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

యువత పోరు జయప్రదానికి పిలుపు



ఆత్మకూరులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని అటకెక్కించడంతో పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్ ఆదిశేషయ్య, పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు అండగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నెల్లూరులో ఈ నెల 12న యువత పోరు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు అంద్రా సుబ్బారెడ్డి, ముతీవర్, వెంగళరెడ్డి, కొప్పోలు వెంకటేశ్వర్లు, రిజ్వాన్, కలాం, యువత నాయకుడు నాగా సుబ్రహ్మణ్యంరెడ్డి, తోడేటి మణి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా తిరుమంజన సేవ



శ్రీవారు, ఉభయదేవేరులకు తిరుమంజనసేవ నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

- సుగంధ ద్రవ్యాలతో పరిమళించిన బిలకూట క్షేత్రం
- వాహన సేవలకు సిద్ధమైన ప్రసన్నుడు

చిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూటక్షేత్రం బ్రహ్మోత్సవాల్లో వాహనసేవలకు ప్రారంభ ఘట్టమైన తిరుమంజన సేవను సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చక బృందం ఉదయత్పూర్వ పూజల అనంతరం తిరుమంజన సేవను ప్రారంభించారు. వైఖానస ఆగమశాస్త్రానుసారం పాలు, పెరుగు, నీరు, తేనె, కొబ్బరినీళ్లు, సుగంధ ద్రవ్యాలతో ప్రసన్న వెంకటేశ్వరస్వామి, ఉత్సవరులను అభిషేకించారు. అనంతరం అంతరాలయంతో పాటు ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేసి ఉత్సవాలకు సిద్ధం చేశారు. ఒకవైపు తిరుమంజన సేవలో వినియోగించిన సుగంధ ద్రవ్యాలు, మరోవైపు పసుపు, కుంకుమలు కలిసిన నీళ్లతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక సుమగంధాలు వ్యాపించాయి. తిరుమంజన సేవ అనంతరం ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీవల్లభునికి ప్రీతిపాత్రమైన తులసీమాలలతో శ్రీవారిని, ఉభయ నాంచారులను అలంకరించి, ఉత్సవమూర్తులకు నూతనవస్త్రాలను సమర్పించారు. హారతి అనంతరం సహస్రధారతో మరోమారు మహాశుద్ధి కార్యక్రమంగా అభిషేకించారు. సర్వాభరణ అలంకారంలో స్వామికి మంగళహారతిని సమర్పించి అంతరాలయ దర్శనాన్ని కొనసాగించారు.

భక్తిశ్రద్ధలతో మెట్లపూజ

బ్రహ్మోత్సవాల్లో శ్రీవారిని సేవించి తరించేందుకు వచ్చిన మహిళలు భక్తిశ్రద్ధలతో మెట్లపూజ నిర్వహించారు. దీర్ఘసుమంగళిగా వర్ధిల్లాలని, భర్త, పిల్లలు, కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ మెట్ల మార్గాన్ని పసుపు కుంకుమలతో పూజించి హారతులిచ్చారు. యువతులతో పాటు సంతానలేమితో బాధపడుతూ కొడి ముద్దల స్వీకరణకు వచ్చిన మహిళలు అధిక సంఖ్యలో మెట్లపూజ, గోపూజల్లో పాల్గొన్నారు.

ధ్వజారోహణతో ప్రారంభమైన ఉత్సవాలు

బిలకూట క్షేత్రంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గరుడధ్వజ సంకేతంతో సోమవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమోక్తంగా వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ భక్తులు గోవింద నామస్మరణ చేస్తుండగా అర్చక బృందం శాస్త్రోక్తంగా ధ్వజారోహణ చేశారు. ఐదు రోజుల పాటు జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాహనసేవలకు సర్వదేవతా పరివారాన్ని, అష్టదిక్పాలకులను ఆహ్వానిస్తూ ధ్వజస్తంభం వద్ద గరుడధ్వజాన్ని ఆరోహణ చేశారు.

ఉత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రసన్నుడికి మంగళవారం హనుమంత సేవ నిర్వహించనున్నారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన మంగళవారం రోజే హనుమంతసేవ కూడా రావడంతో భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల దాతృత్వం



నగదు విరాళాన్ని అందజేస్తున్న విద్యార్థులు

మర్రిపాడు: మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాల విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. సోమవారం పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ సహకారంతో నెల్లూరులోని జనహిత వాత్సల్య ఫౌండేషన్‌కు రూ.25వేలు నగదును విరాళంగా అందజేశారు. ఆంగ్ల ఉపాధ్యాయిని సీహెచ్ కళ్యాణి విద్యార్థుల్లో మానవీయతను పెంపొందించేందుకు పాకెట్ మనీలో కొంత భాగాన్ని పొదుపు చేసి అనాథ పిల్లలకు అందజేయాలని ప్రేరేపించారు. ఈ ఆలోచనను స్వీకరించిన విద్యార్థులు తమ తల్లిదండ్రులు అందజేసిన పాకెట్ మనీలో కొంత మొత్తాన్ని పొదుపు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు సైతం తమ వంతు నగదును అందజేశారు. ఈ మొత్తాన్ని వాత్సల్య ఫౌండేషన్‌కు విరాళంగా అందజేశారు.

సావిత్రిబాయికి నివాళి



కావలి : పట్టణంలోని రంగనాథపురం మున్సిపల్ పాఠశాలలో డాక్టర్ రామ్ సెంటర్, విశ్వోదయ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని సోమవారం నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సావిత్రిబాయి గొప్ప సంఘ సంస్కర్త అని, మహిళా వైతాళికురాలు అని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని గోవిందమ్మ, మెప్మా ఆర్పీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

నివేశన స్థలాలు ఇవ్వాలని వినతి

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన పేదలకు నివేశ స్థలాలు కేటాయిస్తామని ప్రకటించిందని, అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా హామీ అమలు కాలేదని, వెంటనే నివేశన స్థలాలు ఇవ్వాలని పలువురు పేదలు కోరారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆర్డీఓ బీ పావకి వినతిపత్రాలు అందజేశారు. కాగా గ్రీవెన్స్ అర్జీలపై ఆర్డీఓ అధికారులతో సమీక్షించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వెంటనే పరిష్కరించాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటి వరకు వచ్చిన సుమారు 700 పైగా అర్జీలకు ఆయా విభాగాల వారీగా అర్జీదారులకు వ్యక్తిగతంగా సమాచారం అందజేస్తున్నట్లు తెలిపారు.

కలిగిరివాసికి డాక్టరేట్



వెంకట సాయిచంద్

కలిగిరి: కలిగిరికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయుడు నందనవనం ప్రభాకర్‌రావు కుమారుడు వెంకటసాయిచంద్ మైసూరు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ గోపియానాయక్ మార్గదర్శకంలో 'ఏ రోటిక్ డీ కంపోజిషన్ బేస్ట్ ఫ్రేమ్ వర్క్ ఆన్ సీజర్ డిటెక్షన్' (మూర్ఛ వ్యాధిని పసిగట్టు యంత్రం)పై పరిశోధనలు సాగించి పరిశోధనా పత్రం సమర్పించారు. ఇందుకు గాను మైసూర్ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు వెంకటసాయిచంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రెండు పొగాకు బ్యారెన్లు దగ్ధం

దుత్తలూరు: దుత్తలూరు పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురంలో సోమవారం రాత్రి రెండు పొగాకు బ్యారెన్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి, పద్మావతికి చెందిన బ్యారెన్లలో పొగాకు క్యూరింగ్ చేస్తుండగా ఆకులు గొట్టాలపై పడడంతో మంటలు చెలరేగాయి. ఉదయగిరి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో ఒకటి పూర్తిగా, మరొకటి పాక్షికంగా కాలిపోయాయి. సుమారు రూ.7 లక్షల మేర ఆస్తి నష్టం వాటిలినట్లు బాధిత రైతులు వాపోయారు.

ఉపాధి పనులు ఎందుకు నిలిపివేశారు?



అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

ఆత్మకూరురూరల్: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి దేపూరు గ్రామస్తులు చేరుకుని ఉపాధి అమలు తీరులోని అవకతవకలపై అధికారులను నిలదీశారు. గ్రామంలో ఐదు నెలలుగా ఉపాధి హామీ పనులు నిలిపివేయడానికి గల కారణాలు ఏమిటో చెప్పాలని అధికారులను ప్రశ్నించారు. గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త నాయుడు భాస్కర్‌నాయుడు, పెంచలనాయుడు సోదరులు గ్రామంలో మొక్కల పెంపకం, పారిశుధ్య కార్యక్రమాల కోసం తమ సొంత నిధులు ఖర్చు చేస్తామని చెబుతున్నా ఉపాధి ఏపీఓ శిరీషా ఆరు నెలలుగా అనుమతి ఇవ్వడంలేదని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గ్రామస్తులతో ఇదే సమస్యపై చర్చలు జరిపేందుకు ఏపీఓ శిరీషా సమావేశం నుంచి బయటికి రాగా ఆమెపై ప్రశ్నల వర్షం కురిపించారు. గతంలో జరిగిన పొరపాట్లు ఇకపై జరగకుండా చూసుకుంటానని ఏపీఓ చెప్పినప్పటికీ గ్రామస్తులు శాంతించలేదు. తహసీల్దార్ జోక్యం చేసుకుని సమస్య పరిష్కారానికి నిర్దేశిత గడువు సూచించడంతో వారు వెనుతిరిగారు. దేపూరు సర్పంచ్ రావిళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

14 నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

ఉదయగిరి: గండిపాళెంలో నూతనంగా నిర్మించిన పోతురాజు సమేత గంగమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, వాస్తు మండపారాధన, సాయంత్రం అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, క్షీరాధి, జలాధివాసములు, 15న ఉదయం ప్రత్యేక హోమాలు, ప్రతిష్ఠా విగ్రహాల గ్రామోత్సవం, సాయంత్రం క్షీరాభిషేకం, ధాన్యాది, శయ్యాది, పుష్పాది వాసములు, 16న ప్రతిష్ఠా శాంతి హోమాలు, ఉదయం 8 గంటల నుంచి 8.30లోపు యంత్ర, విగ్రహ, ప్రాణ, శిఖర కలశ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం, పూర్ణాహుతి, సాయంత్రం 5 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. కాగా ఆలయ నిర్మాణానికి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి రూ.5 లక్షలు, మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య రూ.2 లక్షలు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దుగ్గిరెడ్డి గురవారెడ్డి రూ.లక్ష, జెడ్పీటీసీ మోది రామాంజనేయులు రూ.50 వేలు వంతున విరాళాలను అందజేసినట్లు తెలిపారు.